# ఆ నవ్వుకి అర్థం?

కొవిలిపాటి విజయలక్ష్మి

"అమ్మ ఇష్టపడలేదు. ఆ సంబంధం చేసుకోలేను సిస్టర్!" అన్నాడు శ్రీనివాస్.

మెచ్చుకున్నాను. ఈ రోజుల్లో తల్లిదండ్రుల మాటకు గౌరవమిచ్చే వారెంతమంది ఉంటారు?

అతని మూడేళ్ళ వయసులోనే అతని తలిదండ్రులు విడిపోయారు. అదొక కథ. వాళ్ళిద్దరూ నాకు తెలిసిన వాళ్ళే. ఇద్దరిదీ ఒకే మనస్తత్వం. పట్టుదల. ఎవరు కాస్త సర్దుకుపోయినా వాళ్ళ జీవితాలు సమాంతర రేఖల్లా నడిచేవి. కానీ, ఇద్దరూ ఒకే ఊర్లో ఉండటం వలన వాళ్ళ పగలూ, పట్టుదలలూ మరీ ఎక్కువయ్యాయి.

రమణమూర్తి జీవితసుఖాలు జారవిడుచుకోలేదు. అతను తెచ్చుకున్న స్త్రీతో, సంపాదించిన ధనంతో అనుభవిస్తున్నాడు. రమణమ్మ మనస్సు అగ్నిపర్వతంలా మండించుకుంటూ, పిల్లలే తన జీవిత సర్వస్వంగా భావించుకుంటూ వేడి నిట్టూర్పులతో కాలం వెళ్ళబుచ్చుతూంది.

తల్లి పిల్లల్ని పెంచినా, తండ్రి వారి చదువు సంధ్యల విషయంలో మాత్రమే జోక్యం పెట్టుకున్నాడు. చదివించాడు. ఆ విశ్వాసం పిల్లలుమనస్సులో దాచుకున్నారు.

తలితండ్రుల మధ్య పిల్లలు ఆటపావులయ్యారు.

తండ్రి ఇంటికి వెళ్తే తల్లికి కోపం. అతనితో కొడుకులు మాట్లాడటం, అతని ఇంటికి వెళ్ళటం ఆమె సహించలేదు. కొడుకుల్ని తిడుతుంది. సాధిస్తుంది. ఏడుస్తుంది. ఆవేశపడిపోతుంది. బాధతో విలవిలలాడిపోతుంది రమణమ్మ.

నిజమే అతను పసిపిల్లల్ని ఆమె మీదికే వదిలాడు. అసలు పిల్లల గురించి అతను పట్టించుకోలేదు. వాళ్ళరోగాలు, రొచ్చులు, ఖర్చులు పుట్టిల్లు చేరిన రమణమ్మే భరించింది. వాళ్ళ ఖర్చుల కోసం డబ్బు సంపాయించాలని చదువు సంధ్యలు రాని రమణమ్మ విస్తర్లు కుట్టి అమ్మేది. చిన్న పిల్లల గౌన్లు, జాకెట్లు లాటివి కుట్టడం నేర్చుకుంది. ఆమె పుట్టింటివారూ పెద్ద కలిగినవారు కాదు. భర్తతో అభిప్రాయ భేదాలు తెచ్చుకుని కలతపడే కూతురికి వచ్చుజెప్పు చూసేది ఆమె తల్లి వరలక్ష్మమ్మ. ఆమె అనుభవంతో చెప్పే మాటలు రమణమ్మకు రుచించేవి కాదు. చాదస్తపు మాటలుగా తోచేవి. "ఏకేంతెలియదమ్మా! సుమతిలా, సావిత్రిలా, ద్రౌపదిలా ఉండమని పతివ్రతల కథలు చెబుతావు. అవి కథలు కాకపోయినా ఆ కాలం వేరు. ఆనాటి పురుషుల ప్రవర్తన వేరు! వాళ్ళతో మమ్మల్ని పోల్చి చూడాలను కోకమ్మా! పక్క గదిలో ఆ గంగతో అతను సరసాలాడుతూంటే నేను సహించలేను. నా గుండెలు మండిపోతాయి" అని భోరున ఏడ్చేది రమణమ్మ. "మంచి రోజులు వస్తాయి ఓర్చుకో అమ్మా! తగులుకున్నది అది. తాళికట్టిన భార్యవు నువ్వు. ఎప్పటికయినా నువ్వు అవుతావు కాని అది అవుతుందా! అతని వయసు, డబ్బు చెల్లాక వదలిపోతుంది" అని తన నిమిరి ఓదార్చే తల్లి చెయ్యి విసిరికొట్టి, "అప్పుడా చెత్త వెధవ నాకెందుకమ్మా" అనేది రమణమ్మ.

"ఉష్ తప్పు అలా నోరుపారేసుకో కూడదు" అని మందలించేది వరలక్ష్మమ్మ. కాని కూతురుకన్నా ఎక్కువ బాధపడేది. తన కూతురు కాపురం ఇలా కలతలపాలవుతుందని ఆమె కలనన్నా ఊహించలేదు. గంగను తిట్టేది శపించేది. తన కూతురు సుఖంగా బ్రతకాలనీ కోరుకునేది.

'తానేం ఇష్టంలేని పెళ్ళిచేసిందా! బంగారు బొమ్మలా ఉండే పదహారేళ్ళ రమణమ్మ చామన ఛాయలో సామాన్యంగా ఉండే రమణమూర్తిని మనస్పూర్తిగా అంగీకరించింది. అతనూ ఆమెను ఇష్టపడ్డాడు. మక్కువ చూపాడు.

ఉన్నంతలో సంతోషంగా తన శక్తి మేరకు కట్న కానుకలిచ్చి వలుగురూ మెచ్చుకునేలా పెళ్ళి జరిపించింది.

వరలక్ష్మమ్మ ఇద్దరు ఆడపిల్లల తల్లి అవగానే ఆమెభర్త మరణించాడు. కొద్దిపాటి





పొలం, మిద్దె ఇల్లు. పాడి పశువులూ. ఆమె సమర్థవంతంగానే సంసారం నెట్టుకు వచ్చింది.

పెద్దకూతురు కాపురం ఫర్వాలేదు. కడుపు పంటలేదని తప్ప మరొక విచారం లేదు ఆమెను గురించి వరలక్ష్మమ్మకు.

రెండవకూతురి బ్రతుకే ఆమె మనసులో ముల్లులా గుచ్చుకుని బాధ పెట్టింది.

కూతురు వినదు. సరే అల్లుడికి చెప్పి చూడాలని ప్రయత్నించింది. "బాబూ!" అని ఆమె ఏదో చెప్పబోయేంతలో "మా వ్యక్తిగత విషయాల్లో మీరు జోక్యం చేసుకోకండి" అని విసురుగా జవాబిచ్చాడు రమణమూర్తి.

వాళ్ళ వ్యక్తిగత విషయాల్లో తను జోక్యం పెట్టుకోకూడదూ. విస్తుపోయింది. వరలక్ష్మమ్మ ఎవ్వరి విషయమో అయితే ఆమె జోక్యం పెట్టుకోదు. తనకేమవసరం లేదు. కాని తన కూతురు కాపురం ఆమె జీవితం కలతలపాలయి చవిటినేలలా నిస్సారమయి గుండెలో నిప్పులు చెరుగుతూంటే ఎలా భరించగలదు? నిశ్శబ్దంగా ఎలా వుండిపోగలదు?

"అదికాదు బాబూ! నా కూతురు తెలివి తక్కువది— నువ్వయినా న్యాయం ఆలోచించు. పిల్లల కోసం కలిసి బ్రతకాలి. నువ్వు కాస్త సరిదిద్దుకుంటే" అన్నదో లేదో అతను అస్సలు లేచాడు.

"నీ కూతుర్ని సరిదిద్దు. చాతయితే! నన్ను తప్పు దిద్దుకోమని చెప్తొచ్చావు. నీ కూతురు ఆడదా! ఆడదయితే చచ్చినట్లు పడివుండును. దానికెంత పొగరు? ఛీ ఛీ నా ఖర్మకాలి కట్టుకున్నాను. అసలదంటే నాకు ఇష్టమే లేదు. నువ్వు, మా అమ్మ కలిసి అంటగట్టారు దాన్ని." అని అతను ఇంకా చాలా నిందారోపణలూ, దుర్భాషలూ పెద్ద గొంతుతో కనులెర్రజేసి వాగుతూంటె. గంగ ముసిముసిగా నవ్వుతూంటె. సిగ్గు, అభిమానం, దుఃఖం, రోషం పొంగుకు రాగా, మరి క్షణం కూడా అక్కడ నిలవ లేకపోయిన వరలక్ష్మమ్మ గబగబా ఇంటి వైపు నడిచింది.

మరి ఆమె కూతురుకి బుద్ధులు గరపలేదు. పిల్లల్ని కూతుర్ని ఆదరంగానే చూసింది. "కొందరికి ధనం, వయస్సు మంచిమార్గాన్ని పడిపిస్తే నా అల్లుడిలాటివాళ్ళకు నిక్కు పొగరెక్కించి. మదాన్నిస్తుంది. వ్యసనాలకు బానిసలవుతారు. వివేకశూన్యులవుతారు. ప్చ్! ఇంతకీ నా కూతురి అదృష్టం" అని సరిపెట్టుకుంది.

* * *

రమణమ్మ ఇద్దరి కొడుకుల్ని తన శక్తి మేరకు గారంగా పెంచింది. తన భర్త ఆ తెచ్చుకున్న గంగకు నానికి సంబంధించిన వారికి పండగలకు పబ్బాలకు కొత్త బట్టలు కొనటం. గంగ రోజా పువ్వులు. నగలు, మంచి చీరలు కట్టడం చూసిన రమణమ్మ ఈర్ష్యా అసూయలతో తన అదృష్టాన్ని దోచుకుంటున్న పిశాచిగా గంగను భావించి దుఃఖించేది నిస్సహాయంగా.

చవకరకం బట్టలు కట్టుకుని. చద్ది అన్నం తిని. పలకా బలపం పట్టుకొని బడికిపోయే తన పిల్లలవైపు జాలిగా చూసి కనులు నవిట చెంగుతో వత్తుకుంటూ "నా కడుపున ఎందుకు పుట్టార్రా. ఆ గంగ కడుపున పుట్టి ఉంటే మంచి బట్టలు కట్టేవారు. మిఠాయిలు తినేవారు. నాన్నపడిలో గారాలు పోయేవారు" అని దీనంగా వాపోయేది. రమణమూర్తి మీద. గంగ మీద ఆమె

గుండెల నిండా కసి. ఉక్రోషం!

తననెందుకిలా మోసం చేశాడు రమణమూర్తి? చిన్నప్పటి వాళ్ళ బాల్యం మొదలు ఇప్పటి వరకూ వారిద్దరూ నాకు బాగా తెలుసు. రమణమ్మ రమణమూర్తి నేనూ ఓసారి పాలెం పెళ్ళికి వెళ్ళాం. ఆ పెళ్ళివారు నాకు, రమణమూర్తిగారికుటుంబానికి బంధువులు కావటం వలన పది పన్నెండేళ్ళ రమణమ్మ తెల్లగా పొడుగ కనులతో, నల్లని జుట్టుతో, సుకుమారంగా అందంగా ఉండేది. ఆ పిల్ల వైపు ఆసక్తిగా చూసేవాడు రమణమూర్తి. పాలెం— ఆ ఊరు, ఊరి ప్రజలు ఆ వాతావరణం నాకిప్పటికీ గుర్తు. తాటాకులమిద్దె ఇల్లు. చుట్టూ మట్టిగోడ. పెరటిలో బావి, జామి చెట్టు, వంగతోట, మిరపతోట, ఏతం నుయ్యి. పిళ్ళబ్బింగా ప్రశాంతంగా వుండే ఆహ్లాదకరమైనవాతావరణం. అక్కడవున్న రెండు రోజులూ ఎంత సరదాగా హాయిగా గడిపాము! వంగతోటలో తిరిగి వంకాయలు తెంపటం, మిరప తోటలో ఎఱ్ఱగా పండిన మిరప పళ్ళు బుట్టలకి ఏరటం చేసేవారం మేం ముగ్గురమూ. రమణమ్మకు మిఠాయి అంటే ఇష్టం. నాకు మినప సున్ని అంటే ఇష్టం. ఎలా ఎక్కడ తస్కరించి తెచ్చేవాడోగాని రమణమూర్తి రమణమ్మకు మిఠాయి, నాకు మినపసున్ని ఆ వంగ తోటలోకి తెచ్చి ఇచ్చేవాడు. మా ఇద్దరికే కాదు మరో నలుగురైదుగురు పిల్లలకు కూడా "ఎవ్వరికీ చెప్పకండి" అని ఇచ్చేవాడు. జామికాయలు కోసి ఇచ్చేవాడు.

ఒకరినొకరు పూర్తిగా ఇష్టపడి పెళ్ళిచేసుకున్నారు. పెద్దకొడుకు పుట్టేవరకు ఫరవాలేదు. ఇద్దరూ అన్యోన్యంగానే కాపురం చేశారు. తరువాత ప్రారంభమయ్యాయి వాళ్ళమధ్య అభిప్రాయ భేదాలు. ప్రతిచిన్న విషయానికి వాదించుకొనటం, రమణమూర్తి భార్యమీద చెయ్యిచేసుకోవడంతో అశాంతి రేగింది. రమణమూర్తి తెగించాడు. పెద్దలు, హితులు చెప్పేమాటలు పెడచెవిన పెట్టాడు. చాటుగా గుట్టుగా కలిసే గంగను ఇంటికి రప్పించుకోవటం మొదలుపెట్టాడు.

రమణమ్మలో సహనం చచ్చిపోయింది. ఆమె గుండెల్లో మంటలు రేగాయి. "ఓర్చుకో, కాపురం చెడగొట్టుకోకు ఆకాశంలో పక్షి ఎంతకాలం ఎగురుతుంది" అని తల్లి, హితులు చేసే బోధలు ఆమె చెవికెక్కలేదు. తన నెంతగానో ప్రేమించి, మనసిచ్చి పెళ్ళి చేసుకున్న రమణమూర్తి తననిలా మానసిక వేదనకు గురిచెయ్యడం సహించలేకపోయింది. అతన్నుంచి దూరంగా తను తప్పుకోవటమే తనకు శాంతి కలిగిస్తుందనే నిర్ణయానికి వచ్చింది.

ఓ రోజు గట్టిగా అతన్ని అడిగేసి తాడో పేడో తేల్చుకోవాలనే అనుకుంది.

ఆవాళ గంగ రాలేదు మూడేళ్ళ పెద్దవాడు, ఏడాది దాటిన చిన్నవాడూ నిద్రపోయారు.

వెల్లకిలా పక్కలేని పట్టిమంచంమీద పడుకుని ఇంటి పైకప్పు వైపు చూస్తున్న రమణమూర్తి వైపు చూసింది రమణమ్మ.

అతనా గంగను వదులుతాడో లేదో. ఎలా సంభాషణకు ఉపక్రమించాలో అనే ఆలోచనలో వున్న రమణమ్మను రమణమూర్తే పిలిచాడు. "ఏమే ఇలారా" అని.

అధికార పూర్వకమైన ఆ పిలుపు రమణమ్మకు రుచించలేదు. గోడవైపు తిరిగి అతనికి ముఖం చాటు చేసుకుంది.

"నిన్నే పిలిపించటంలా ఏమిటా పొగరు?"

పెదవి విరిచి వెగటుగా నవ్వింది రమణమ్మ, చివాలున అతను పడుకున్న మంచం వైపు దృష్టి సారిస్తూ.

"ఏమిటా వెధవనవ్వు-రమ్మంటుంటే"

"ఉహూ" తలఅడ్డంగాఊపింది రమణమ్మ.

"రెండు తగలనివ్వగలను" అతని గొంతులో కోపం

"అదిచెయ్యటానికి డబ్బుఅవసరంలేదు."

"అనవసరంగా వాగి నాకు కోపం తెప్పించకు. నోరు మూసుకురా."

"నేను రాలేనని చెప్పానుగా."

"ఏం? ఏమయ్యింది నీకు?"

"నాకు ఇష్టంలేదు."

"ఇష్టం లేకపోయినా నువ్వు పెళ్ళానివి. నేను మొగుణ్ణి పిలిచిన వెంటనే రావాలి."

## మార్క్సిజానికి కాలదోషం

పీకింగ్, డిసెంబర్ 13—కారల్ మార్క్స్ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇవ్వాలని చైనా నిర్ణయించింది. జాతిని మరింత ఆధునాతనం చేయాలంటే మార్క్స్ సిద్ధాంతాలకు కట్టుబడివుండడం సాధ్యంకాదని చైనా కమ్యూనిస్టుపార్టీ అధికార పత్రిక "పీపుల్స్ డెయిలీ" ఇటీవల మొదటి పేజీలో ప్రచురించిన అసాధారణమైన సంపాదకీయంలో పేర్కొన్నది.

1818-1883 మధ్య కాలంలో జీవించిన మార్క్సిస్ట్ తత్వవేత్త కారల్ మార్క్స్ సిద్ధాంతాలు ప్రస్తుత కాలంలో ఆచరణ యోగ్యం కావని వాటికి కాల దోషం పట్టిందని ఆ పత్రిక వ్యాఖ్యానించింది.

మార్క్స్ నూటొక్క సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఆయన సిద్ధాంతాలు కూడా నూరు సంవత్సరాల క్రితం నాటివి. ఆయన తన సిద్ధాంతాలను చాటి చెప్పిన తర్వాత ఎన్నో మార్పులు వచ్చాయని సంశయం లేదని ఆ సంపాదకీయం పేర్కొన్నది.

మార్క్స్‌కు ప్రస్తుత కాలం గురించి తెలియనందున ఆయన సిద్ధాంతాలలో కొన్ని ప్రస్తుత కాలానికి తగినట్టివిగా లేవు. ఎంగిల్స్, లెనిన్ పరిస్థితికూడా అంతేనని "పీపుల్స్ డెయిలీ" వ్యాఖ్యానించింది.

నేడు మనం ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారికి తెలియదు. అందువల్ల ప్రస్తుత సమస్యలను పరిష్కరించుకోవడానికి మార్క్స్, లేదా లెనిన్ సిద్ధాంతాలను పాటించలేమని ఆ పత్రిక పేర్కొన్నది.

## మార్క్సిజానికి కాలదోషమా?

ఈ వివాదంపై ఆంధ్ర దేశంలోని మేధావులు, రాజకీయవాదుల నుంచి అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాము. ఆసక్తికరమైన ఈ చర్చావేదికలో పాఠక లోకం పాల్గొని మారుతున్న ప్రపంచంలో మారని విలువలకు, మారని మనుష్యులకు సరయిన మార్గాన్ని సూచించగలరని ఆశిస్తాము! మీ అభిప్రాయాలు వీలయినంత క్లుప్తంగా, సూటిగావుండాలి. మీ అభిప్రాయ రచనలను "మార్క్సిజానికి కాలదోషమా?" ఎడిటర్, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, పోస్ట్‌బాక్స్ నెం. 712, విజయవాడ-520 010కు వెంటనే పంపండి.

—ఎడిటర్

డ్యూటీ! బ్యూటీ! డ్యూటీ! బ్యూటీ!
అరకులోయ అందాలకు
విప్లవ నీరాజనం
ఊరాలకారు
(నవలిక)
శ్రీమతి సరోజినీ ప్రేమ్‌చంద్
త్వరలో ప్రారంభం!

"అన్ని ధర్మాలూ పాటిస్తున్నట్టు!" అస హ్యంగా నవ్వింది రమణమ్మ.

అతను లేచి నిల్చుని కనులెర్రజేసి "ఊ. లే. పిల్లలు లేదారంటే వాళ్ళని. నిన్ను కలిపి రేపు పెట్టగలను."

"ఆ గంగను వదిలితేగాని నన్ను ముట్ట వద్దు."

"ఓహో అదా సంగతి! నీకిష్టమైతే ఇంట్లో వుండు. లేకపోతేపో-దాన్ని జన్మలో వదలను. దాని పేరెత్తావంటే డొక్క చీరేస్తాను" అన్నాడు రమణమూర్తి.

ఆ మాట విన్న రమణమ్మ పిల్లలున్న ఆడ పులిలా రెచ్చిపోయింది. ఆమె వళ్ళు హూనమయ్యేటిది. పిల్లలుగోలపెట్టి ఏడ్చారు. రమణమ్మ అడ్డుపడినా పిల్లల మీద చెయ్యి చేసుకున్నాడు రమణమూర్తి. తర్వాత అతను విసురుగా అవతలకి వెళ్ళిపోయాడు.

నిస్సహాయంగా గోడకిచేరబడి ఏడ్చింది రమణమ్మ. కంటి నీరు ఇగిరేవరకూ పిల్లల్ని ఓదార్చి నిద్రపుచ్చింది. ఏరాత్రికో ఆమెకు చిన్న కునుకు పట్టింది.

ఇలా కొన్ని ఘర్షణలూ, తగువులూ, అల్లర్లూ అయ్యాక ఇద్దరూ విడిపోయారు. ఎవరేం చెప్పినా వారిద్దరి మధ్య పట్టుదలలూ పంతాలు పెరిగి పట్టు వదలలేదు.

దారం తెగింది.

"నా పిల్లల వలన నేను సుఖపడతాను. నా పిల్లలు మంచివాళ్ళు. నామీద అభిమాన మున్నవాళ్ళు"- దృఢంగా నమ్మింది రమణమ్మ.

ఆ మాట ఈ మాట వారి గురించి విని వారివల్లనే విని నేను ఊహించిన కథ ఇది.

* * *

"ఆ అమ్మాయి నాకు బాగా నచ్చింది కాని. అమ్మను బాధ పెట్టకూడదని మానేశాను" మళ్ళీ అన్నాడు శ్రీనివాస్.

అతని భుజం తట్టి "సెభాష్ నువ్వయ్యా కొడుకువంటేనూ. అమ్మను సంతోషపెట్టు. ఆమె జీవితంలో సుఖసంతోషాలెరుగదు" అని మెచ్చుకోలుగా అన్నాను.

* * *

చాలా రోజులు గడిచాయి. వాళ్ళ విషయాలు నాకు తెలియలేదు. ఆ రోజు మా ఇంట్లో పిల్లల పుట్టినరోజు సందర్భంగా ఓ ఫంక్షన్ ఏర్పాటుచేశాం. శ్రీనివాస్ ఊర్లోనే ఉన్నాడట. పిల్లలెవరో చెప్పారు. అతన్ని పిలవమన్నాను.

అంతా వచ్చివెళ్ళాక చాలా పొద్దు పోయాక తెల్లగా బొద్దుగా వున్న ఇరవై సంవత్సరాల అమ్మాయిని వెంటపెట్టుకుని వచ్చాడు మువ్వయ్యేళ్ళ శ్రీనివాస్.

అందంగా కత్తిరించిన చిన్న మీసం, నీటుగా డ్రస్ వేసుకున్న శ్రీనివాస్ నన్ను చూస్తూనే సంతోషంగా "పిన్నీ" అనిచిన్నగా నవ్వాడు. అతనిలో ఒక నిండుతనం.

"అమ్మా నాన్న బాగున్నారా? అన్న దమ్ములిద్దరికీ పెళ్ళిళ్ళు అయ్యాయనుకుంటాను. శుభలేఖన్నా నాకు పంపావుకాదు. "విష్తరంగా, నవ్వుతూ అని, "కూర్చోండి. ఏమిటి కబుర్లు?" అన్నాను.

"ఏమున్నాయికబుర్లు! అంతా మామూలే" అని అదోలా నవ్వుతూ కుర్చీలో కూర్చున్నాడు శ్రీనివాస్. అతని పక్కన ఒద్దికగా కూర్చుందా అమ్మాయి.

"తమ్ముడూ నేనూ, మాకు నచ్చిన అమ్మాయిలతో మేమే పెళ్ళిళ్ళు జరిపించుకున్నాం. ఎవ్వర్నీ పిలవలేదు పిన్ని. క్షమించు" అన్నాడు శ్రీనివాస్.

తర్వాత నా ప్రశ్నలు. అతనిజవాబులూ.

నేను అతన్ని ఆ ఊరు తీసుకు వెళితే దీనికెందుకు. పింజారీముండ ఒకటే ఏడుపు. ఎంత చెప్పినా ఊరుకోదు కదా! దరిద్ర గొట్టుముండ చచ్చినా బాగుండును. పెళ పెళా తిడుతున్నాడు. ఇతని చదువు, ఉద్యోగం, అలంకరణ, టీవి వెనుక దాగి వున్న సంస్కారం ఇదా! ఎవరిని తిడుతున్నాడు? భార్యనా! తల్లినా! అవాక్కైనై ఆశ్చర్యంగా వింటున్నాను. అతని మీద నాకుండే వాత్సల్యం గౌరవం అన్నీ చెదరిపోతున్నాయి.

అతను తిడుతూన్నది తల్లినని తెలుసుకున్నాక. శివ శివా! అని చెవులు మూసుకున్నాను.

విత్తు ఒకటి మొక్క ఒకటి అవుతుందా?

నా పెదవుల మీద నవ్వు కదిలింది. అదెలాటి నవ్వో నాకు తెలియదు. నవ్వులు చాలా రకాలుంటాయట కదా మరి!

*

## అక్షర విద్యుత్తు

నువ్వు
మెయిన్ స్విచ్ నొక్కేసి
ఒక ప్రాంతాన్ని
అంధకారం చేయొచ్చు:
ఆ ప్రాంతపు విద్యుత్తు ఆయువు
అక్కడే వుంటుంది గనుక.
కానీ,
కవిని తొక్కేసో, పీక నొక్కేసో
ఏ ప్రాంతాన్నీ
నీ గుప్పిట్లోకి తేలేవు:
అతని అక్షర విద్యుత్తు
అంతటా వెలుగుతుంది,
మేలుకొలుపుతుంది గనుక.

(శ్రీ వరవరరావుకి)

—జి. వెంకటేశ్వర్లు